# తీగ తెచ్చిన సంపద

ఆఫీసులో కూర్చుని రాసుకుంటున్న హనుమంత రావుకు గుండె ఆగినంత పనైయింది - హఠాత్తుగా వచ్చిన "టెలిగ్రాం" చూసేసరికి. ఒక్క హనుమంతరావు కేమిటి, ఆఫీసులో వున్న ఆఫీసు బాయ్‌నుంచి అసిస్టెంటు మేనేజరు దాకా అందరికీ అలానే అనిపించింది.

ఆదుర్దాతో, వణుకుతున్న చేతుల్తో హనుమంతరావు కవరు చించుతూంటే, తోటి గుమాస్తాలంతా నోళ్ళు తెరచుకుని చూస్తూ వుండిపోయారు ఆశ్చర్యంతో.

టెలిగ్రాం చదువుతూనే కొయ్యబారిపోయాడు హనుమంతరావు! చలనరహితమైన అతన్ని చూసి అందరూ వాళ్ళవాళ్ళ స్థానాలలోనుంచి లేచారు ఆదుర్దాగా.

హనుమంతరావు చేతిలోవున్న టెలిగ్రాం తీసుకుని, అవధాని ఏదో అస్పష్టంగా చదివాడు గుటకలు మింగుతూ. అందరికళ్ళూ అవధాని చేతిల్లోవున్న టెలిగ్రాంపై పడ్డాయి.

"ఒక లక్షా యిరవైవేలు! సెకండ్ ప్రైజ్! ఐర్లండ్ రేస్ లాటరీలో వచ్చింది హనుమంతరావుకు. అందుకేనేమో అదృష్టం చెప్పి రాదంటారు. అదృష్టం వచ్చేటప్పుడు ఇంటి కప్పునైనా పగలగొట్టుకుని వస్తుందట!

ఆరు సంవత్సరాలుగా. మెరుగూ బాదుగూ లేని గొర్రెతోక జీతంతో, నానావస్థలు పడుతూ జీవితాన్ని నెట్టుకొస్తున్నాడు ప్రయివేటు 'ఫరం'లో గుమాస్తాగిరి

చేస్తూన్న హనుమంతరావు. ప్రతిరోజూ ఏదో సందర్భంగా మేనేజరుచేత చీవాట్లు తినక తప్పేదికాదు. దానికి తగినట్టే హెడ్ గుమాస్తా యేదో ఒకటి వెతికి తనమీద రిపోర్టు చేస్తూ వుండేవాడు మేనేజరుకు. ఒకటి రెండుసార్లు వుద్యోగం వూడిపోయే ప్రమాదంకూడా కలుగకపోలేదు. హనుమంతరావు అతి బద్ధకస్తుడైనా తెలివితేట లున్నవాడనే మేనేజరు అభిప్రాయం. అదే అతన్ని ఇంకా వుద్యోగంలో వుంచగలిగింది.

హనుమంతరావూ అనుకోకపోలేదు, ఆ వుద్యోగంలోంచి మానుకోవాలని. కాని, అంతకంటే గత్యంతరంలేకే ఆ గుమాస్తాగిరి చేస్తున్నాడు.

హాల్లో జరుగుతూన్న గలభాను గమనించిన మేనేజరు తన గదిలోంచి బయటికి వచ్చాడు. మేనేజరుని చూడగానే ఎక్కడవాళ్ళక్కడ కుక్కిన పేనులై పోయారు. హనుమంతరావు టేబిల్ మీదవున్న టెలిగ్రాం హెడ్ గుమాస్తా మేనేజరు చేతి కందించాడు. అది చదువుకున్న మేనేజరు హనుమంతరావును ఆశ్చర్యంతో కళ్ళెగరేసి చూసి, ఓ చిరునవ్వుతో అభినందించి తన గదిలోకి పోయాడు.

హెడ్ గుమాస్తా అంటే వున్న భయంతో రామం, సుబ్బారావు, అవధాని, సత్యం ఏవో కాగితాలు తిరగేస్తున్నా, వాళ్ళ మనసులుమాత్రం హనుమంతరావుకు వచ్చిపడిన 'అదృష్టం' పైనే పనిచేస్తున్నాయి. అరవైయేడు రూపాయలు సంపాదించుకునే హనుమంతరావు అకస్మాత్తుగా లక్షాధికారి అయేసరికి ఓ పక్క తెలియని సంతోషంతో

మరో పక్క తెలిసిన అసూయతో బాధపడ్డారు అతని స్నేహితులూ, తోటి గుమాస్తాలూను.

హెడ్ గుమాస్తా ఆశ్చర్యమంతా కొద్ది కాలంలోనే అసూయగా మారింది. తనే నిజంగా ఓ లక్ష రూపాయలు పోగొట్టుకొన్నట్లుగా ఫీలయ్యాడు.

అయోమయంలోంచి తేరుకున్న హనుమంతరావు టెలిగ్రాం పేపరు మడిచి జేబులో పెట్టుకొన్నాడు. ఇంత కాలంగా, జీవితాన్ని క్రుంగదీస్తున్న ఆఫీసు ఫైల్సును ఓ పక్కకు నెట్టివేశాడు. స్టార్ సిగరెట్ ఒకటి (కానీరకం) వెలిగించి, కాళ్ళతో మేజాను తన్నిపట్టి, కుర్చీలో వెనక్కు జారగిలబడి తదేక దీక్షతో యింటి కప్పు కేసి చూస్తున్నాడు హనుమంతరావు. అతని ఆరు సంవత్సరాల సర్వీసులో, యిదివర కెప్పుడూ ఆఫీసులో అలా కూర్చుని వుండలేదు. అలా సిగరెట్ వెలిగించి వుండలేదు. ఈరోజు అలా కూర్చునే సాహసం, ధీమా కలిగిందంటే, అతని జేబులో ఆ టెలిగ్రాంలో వున్న ఏ మహత్తరశక్తి అతని రక్తనాళాల్లో ప్రవహించిందో మరి !

అచ్చగా మేనేజరు కూర్చున్నట్టే కూర్చొని హనుమంతరావు సిగరెట్ పొగ వదుల్తూంటే అతని నిర్లక్ష్యానికి హెడ్ గుమస్తాకి వళ్ళు మండిపోయింది. ఏదో అనబోయి, నోటిదాకా వచ్చినదాన్ని గొంతులోకి దిగమింగి గుటకలు మింగాడు !

అరగంట క్రితం హనుమంతరావు లోకందృష్టిలో క్షుద్రజీవి. భయస్తుడు, అప్రయోజకుడు, చేతగాని దద్దమ్మ?

దేబరి, గాడిద చాకిరీకి జీవితాన్ని అర్పితంచేసిన గుమస్తా. మరి యిప్పుడో !

ప్రతినెలా హనుమంతరావు పదిరూపాయలు పజిల్సుకని, లాటరీలకని తగలేస్తూవుండేవాడు. పదిహేనో తేదీనుంచి కాఫీకి సిగరెట్లకూ దేబిరించుకొని స్నేహితులచుట్టూ చేయి చాపుకు తిరుగుతుండేవాడు. దగ్గర స్నేహితులకు ఒదిలించుకో లేని సమస్యగా తయారయ్యాడు. హనుమంతరావుకు తను పోషించాల్సిన వెనకా ముందూ "జిందుకాణా" ఏమీ లేకు కాబట్టి సరిపోయింది ! తను చేసిన తెలివైన పనుల్లో పెళ్ళి చేసుకోకపోవటం వొకటని నెలలో చివర పదిరోజుల్లో ఒక సారైనా అనుకుంటుండేవాడు. తను చేసుకోదలిస్తే గంతకు తగ్గ బొంత వొకటి దొరక్కపోయేదికాదు. అలా అని తొందరపడి వో గుదిబండ తగిలించుకుంటే తనపాట్లు... కూడా పడేవి కావేమో ననుకునేవాడు !

రాత్రికి భోజనం టికెట్ ఎవర్ని అడగాలా అని ఆలోచిస్తున్న హనుమంతరావు ఆఫీసు గడియారం అయిదు కొట్టింది కూడా గమనించలేదు. అవధాని, రామం, సత్యం అంతా వచ్చి చుట్టూ మూగారు.

"లక్షాధికారి హనుమంతరావు యివ్వాళ మనకు పార్టీ చేస్తాడ్రా !" అన్నాడు రామం.

జేబులో చిల్లికానీ లేని హనుమంతరావు మనసు చివుక్కుమంది.

"మీలో ఎవరన్నా పెట్టుబడిపెడ్తే అలాగే చేస్తానోయ్ !" తలో రకంగా హనుమంతరావుకు వుషారెక్కి

స్తున్నారు. అంతలోకే మేనేజరుదగ్గర్నుంచి కబురొచ్చింది- "హనుమంతరావు గౌరవార్థం మేనేజరుగారు టీపార్టీ యిస్తున్నారని. 5-30 గంటలకు ఆఫీసు స్టాఫ్ అంతా మెయిన్ హాల్లో సమావేశం కావాలని."

టీపార్టీ అనంతరం మేనేజరుగారు స్వయంగా వచ్చి హనుమంతరావును రాత్రికి తన ఇంట్లో డిన్నర్‌కు రావాల్సిందని ఆహ్వానించారు. అలా మేనేజరుగారే స్వయంగా వచ్చి పిలుస్తుంటే అతను కాదని ఎలా తప్పుకోగలడు ?

రాత్రి 8-15 గంటలకు హనుమంతరావు గదిముందు ఫోర్డు కారొచ్చి ఆగింది. రామం తెచ్చి యిచ్చిన ట్వీడ్ కోటు, సత్యం ఇచ్చిన త్రీ కాజిల్స్ సిగరెట్ టిన్‌తో టిప్‌టాప్‌గా కారెక్కాడు హనుమంతరావు.

ఆ రాత్రి డిన్నర్ సందర్భంలో హనుమంతరావును మేనేజరు, క్లబ్ సెక్రెటరీకీ మ్యునిసిపల్ చైర్మన్‌కు, బ్యాంక్ మేనేజరుకు, ఇంకా కొంతమంది పెద్ద వుద్యోగస్తులకు పరిచయం చేశాడు.

పార్టీ అయ్యాక వెళ్ళబోయేముందు మేనేజరు హనుమంతరావును పిలిచి రహస్యంగా కోటు జేబులో అయిదు పచ్చనోట్లు వుంచి "ఖర్చులకు కావాల్సి వస్తుందేమో అందాకా (?) వుంచుకో, తర్వాత చూసుకోవచ్చు" అన్నాడు.

హనుమంతరావు తన కృతజ్ఞత తెలియజేసి కారెక్కాడు. కొత్త ఫోర్డు కార్లో మెత్తని స్ప్రింగ్ కుషన్స్‌లో కూర్చొని త్రీకాజిల్స్‌సిగరెట్ తాగుతూంటే అతనిహృదయం

అంతు తెలియని ఆనంద ప్రవాహంలో తేలిపోతూంది! తెల్లటి వెన్నెట్లో మెరుస్తూన్న తారురోడ్డుపై కారు వేగంగా పోతూంది. చల్లటి గాలివీచి అతని మనసు గిలిగింతలు పెడ్తూంది. కార్లో రేడియోసెట్ పాడుతూంది – "కిస్మత్ హమారే సాత్ హై – మర్నేవాలే మరాకరేఁ జల్నే వాలే జరాకరేఁ డడఢాం డడ –"

కారు కైలాస్ భవన్ మలుపు తిరిగింది. అవధాని హోటల్లోంచి బయటికి వస్తూన్నాడు. నిన్న రాత్రి అదే సమయానికి, ఆ హోటలుముందు కాలే కడుపుతో అవధాని కోసం ఎదురుచూస్తూ నుంచున్నది గుర్తొచ్చింది. అవధాని వొక్క భోజనం టికెట్ కోసం మొహం తప్పించి ఆపూట కసలు అట రావటమే మానుకున్నాడు! కాసిని టీనీళ్ళు తాగి గదిలోకిపోయి పండుకుంటే నిద్ర పట్టలేదు. పొత్తి కడుపులో తోడేళ్ళు కదుల్తూంటే నిద్దెక్కడ వస్తుంది!

రెండు మూడు సందులు తిరిగాక, కారాగింది. హనుమంతరావు గదిలోకిపోయి కోటు విప్పుతూ జేబులోని ఐదు వందల రూపాయలు తీసి లాంతర వెలుతుర్లో చూసుకొన్నాడు. తనన జీవితమంతా గుమాస్తాగిరి చేసి సంపాదించినా వొక్కసారి ఐదు వందలు రూపాయలు కళ్ళ చూడ లేడేమో?

ఆరు సంవత్సరాలుగా వొక్క రూపాయికూడా తన జీతం పెంచని మేనేజరు, తతిమ్మా కంపెనీలు యిచ్చిన బోనసు కూడా ఎగనామం పెట్టిన మేనేజరు యింత ఉదారంగా ప్రవర్తించడం ఆశ్చర్యాన్ని కలిగించినా, దానికి

అడుగునవున్న కారణాన్ని మరుగు పరచలేకపోయింది. ఏమైనా ఇప్పుడు అతనికి మేనేజరంటే ఉండిన అసహ్యాం, విద్వేషం, అభిమానం గౌరవంగా మారింది.

హనుమంతరావుకు జరిగినదంతా ఓ పెద్ద కలగావుంది. తలనిండా ఊహల్తో ఆ రాత్రి నిద్ర పట్టలేదు సరిగా.

*   *   *

ఉదయం మామూలుగానే ఆఫీసుకెళ్ళాడు హనుమంత రావు. కాని అతని సీట్లో మరొకరు కూర్చొని ఉన్నారు! అంతలోనే ప్యూన్ వచ్చి "మిమ్మల్ని మేనేజరుగారు రమ్మంటున్నారు" అని చెప్పాడు.

హనుమంతరావు లోపలికి వెళ్ళగానే మేనేజరు చిరునవ్వుతో ఆహ్వానించాడు.

"ఈ రోజునుంచి మీరు మన ఫరం అసిస్టెంట్ మేనేజరు!" ఆర్డరు చేతికిస్తూ అన్నాడు.

"థ్యాంక్స్" ఆశ్చర్యంతో ఆర్డర్ అందుకుంటూ అన్నాడు. అంతకంటే ఇంకేం తోచలేదు హనుమంతరావుకు. తర్వాత మేనేజరు మాటల సందర్భంలో, హనుమంతరావు లక్షా యిరవై వేలు ఏం చేయదలచుకుందీ అడిగాడు. హనుమంతరావు ఆసంగతి ఇంకేమీ నిర్ణయించుకోలేదని చెప్పాడు.

"అయితే చూడు! హనుమంతరావ్! డబ్బంతా ఊరికే బ్యాంక్‌లో వేసి ఉంచడ మేమంత తెలివైన పనికాదు. మన ఫరంకు ఎలా లాభాలు వస్తున్నదీ నీకు తెలియనిదేమీ కాదు. ఫరం లక్ష రూపాయల్తో బాగా డెవలప్ చేయొచ్చు.

"తెలిసీ తెలియని కంపెనీలో వాటా కలవడం దేనికి? నీకు ఇష్టమయితే మన ఫరంలో వాటా ఇవ్వడానికి నాకేమీ అభ్యంతరం లేదు. పైగా నీవు అసిస్టెంటు మేనేజర్‌గా ఉంటూ న్నావు కాబట్టి నాకూ కొంత విశ్రాంతి దొరుకుతుంది! మరి నీ ఇష్టం!" ఒక్క గుక్కలో చెప్పదలచింది సూటిగా చెప్పాడు మేనేజర్.

హనుమంతురావు ఒక్కక్షణం, ఆలోచిస్తున్నట్లుగా ముఖం పెట్టాడు. నిజానికి అత డాలోచించిన దేమీ లేదు. ఖాళీ బుర్రలోకి ఏవో కొత్త ఐడియాలు తెచ్చుకోవాలని ప్రయత్నించాడు.

"సరేలెండి! అలాగే చూద్దాం! అనక తప్పలేదు అసిస్టెంటు మేనేజరయిన హనుమంతరావుకు.

"మిస్టర్ హనుమంతరావ్?" గంభీరంగా చూస్తూ అన్నాడు మేనేజర్. "డబ్బు అనేది ఎప్పుడు చస్తుందో తెలుసా?"

"ఊహుఁ!"" అంటూ తల అడ్డంగా తిప్పాడు హను మంతరావ్. 'డబ్బు పుట్టడం చూడని తనకు అది చావడం అనేది ఎక్కడ తెలుస్తుంది గనుక' అనుకొన్నాడు హనుమంత రావ్.

"అయితే విను! డబ్బు ఎప్పుడైతే పెరగడం మానుతుందో అప్పుడే మరణిస్తుంది." తనేదో నీతోపదేశం చేస్తున్నట్టుగా భావించి మొఖంపెట్టి చెప్పాడు మేనేజర్.

హనుమంతరావ్ అసిస్టెంట్ మేనేజరయి, చార్జీ తీసుకొన్న రోజు, ఆఫీసులో ఉన్న అర్ధాకలి గుమాస్తాలంతా అప్పులు చేసి, చందాలు వేసుకొని ఘనంగా పార్టీ ఇచ్చారు హనుమంతరావు గుణగణాల్ని గురించి, మేనేజర్ దగ్గర్నుంచీ అందరూ పొగడి మాట్లాడారు.

* * *

హనుమంతరావ్ ఆఫీసు అసిస్టెంటు మేనేజరయాక ఆఫీసు పనంతా సాఫీగా నడుస్తోంది. ముఖ్యంగా హెడ్ గుమాస్తా వళ్ళువంచి పని చేస్తున్నాడు, తన లోటుపాట్లు తెలిసినవాడు యజమాని అయాడు కాబట్టి.

రెండు మూడు నెలల్లోనే హనుమంతరావ్ ఎంతో పలుకుబడీ, వ్యాపారానుభవం గడించాడు.

కాస్మా పాలిటనీ క్లబ్ లో హనుమంతరావు పేరు వినని వాళ్ళు లేరు. వట్టి హనుమంతరావ్; మిస్టర్ హనుమంతరావ్ అయాడు. అతని పరిచయం కోసం చాలామంది ఉబలాట పడేవాళ్ళు. అతన్లో వున్న కలుపుగోలుతనం, చొరవ చాలా మందిని ఆకర్షించింది. ఆ రెండుమూడు మాసాల్లో అతడు లేకుండా ఏ వొక్క పార్టీ జరగలేదంటే అతిశయోక్తి కాదు. అతనే స్వయంగా రెండుమూడు విందులు చేశాడు, సబ్ జడ్జీ, డిప్టీకలక్టరు, బదిలీ అయిపోతుంటే. అమధ్యలో ఏదో ఆహ్వాన

సంఘానికి అధ్యక్షుడుగా కూడా ఉన్నాడు. ఇప్పుడు హనుమంతరావు పూర్తిగా పెద్దతరగతి—మిల్లు యజమానులు, బ్యాంక్ మేనేజర్లు గొప్ప ఉద్యోగులు, లక్షాధికార్లు—వీళ్ళతోనే తిరగడం! అలా అని తన పాతస్నేహితుల్ని చిన్న చూపు చూశాడని అనిలేం. వాళ్ళే తప్పుకు పోతూండే వారు. అతను యెదురైనప్పుడు. పైగా హనుమంతరావే ఎంతో మారిపోయాడనేవాళ్ళు. వొకటి మాత్రం నిజం, హనుమంతరావుని తమ స్నేహితుడుగా చూసుకునే తాహతు, అంతస్థు తమకు లేదనేది వాళ్ళు గుర్తించారు.

అరవై యేడు జీతపురాళ్ళు తెచ్చుకొన్నంత కాలం, గుమాస్తా హనుమంతురావు—అసమర్థుడు, అప్రయోజకుడు, సిగ్గుమాలిన వాడుగా కనపడ్డాడు లోకానికి. లక్షాధికారి, అసిస్టెంట్ మేనేజరు అయిన హనుమంతరావు ప్రయోజకుడు, సమర్థుడు, తెలివి గలవాడు, గౌరవనీయుడుగా కనపడ్డాడు ఆ లోకపు కళ్ళకే!

అసిస్టెంటు మేనేజరుగా, లక్షాధికారిగా, తనకు వచ్చిన ప్రతి చిన్న అవకాశాన్ని కూడా జాగ్రతగా సద్వినియోగ పరుచుకొన్నాడు. అనతి కాలంలోనే పురప్రముఖుల్లో వొకడయాడు హనుమంతరావు.

*    *    *

"స్వతంత్రా మిల్సు" మేనేజరు కూతురు మిస్ రమాదేవి హనుమంతరావుని ఆకర్షించింది. లేక హనుమంతరావే

ఆమెను ఆకర్షించుకొన్నాడో మరి! ఏమైనా మిస్ రమాదేవి, మిసెస్ హనుమంతరావు కావటానికి ఎంతో కాలం పట్టలేదు. వచ్చిన అవకాశాన్ని తెలివి తేటల్తో, సున్నితంగా సానపట్టు కొచ్చాడు. పరిచయం ప్రేమగాను, ప్రేమ వివాహంగాను కొద్దివారాల్లోనే పరిణామం చెందింది.

"స్వతంత్రామిల్సు" మేనేజరుగారికి మొదట్లో యీ వివాహం యిష్టంలేకపోయినా ఏనుయ్యోగొయ్యో చూసు కుంటానన్న వొక్కగాను వొక కుమార్తెకోసమైనా వొప్పు కోక తప్పిందికాదు.

అల్లుడి ప్రయోజకత్వాన్ని తెలివితేటలను గుర్తించిన మామగారు, అతన్ని వుద్యోగంలోంచి మాన్పించి, ఏభై అరవై లక్షలదాకా విలువచేసే తన మిల్లు మేనేజిమెంట్ అప్పచెప్పి, పెద్దతనం వచ్చిన తను పక్కకు తప్పుకొన్నాడు. అల్లుడైనా కొడుకైనా హనుమంతురావేగా మరి.

మూడంతస్థుల "గ్రీన్ పాలెస్" నివాసంలో హను మంతరావుగారి అంతస్థు పూర్తిగా మారిపోయింది. ఇంటినిండా నౌకర్లు, రెండు మూడు జాతుల కుక్కలూ, హిల్‌మాన్, చవర్లెట్, స్టుడీబేకరు, మొత్తం మూడుకార్లూ యింకా మిల్లుకు సంబంధించిన కొన్ని ట్రక్కులు – హనుమంతరావు గారు ఐశ్వర్యన్ని అనుభవిస్తూంటే ఆయనగారి పుట్టుపూర్వోత్త రాలు తెలిసినవాళ్ళు అసూయ పడటంకంటే చేయగలిగిం దేమీలేదు.

ఉదయం కాఫీ అయాక పేపరు తిరగేస్తున్న హనుమంతరావుకు, హఠాత్తుగా వచ్చిన పాత స్నేహితుడు, డిటెక్టివ్ కథలురాసే విశ్వాన్ని చూసేసరికి ఆశ్చర్యం గలిగింది. అంతకంటె ఆశ్చర్యంలో, అయోమయంలో మునిగిపోయి నోరు తెరుచుకు నుంచున్న విశ్వాన్ని చేత్తో కుదిపి, కుర్చీలో కూర్చోపెట్టాడు. విశ్వానికి తను పొరపాటున యీ బంగాళా లోకి రాలేదుకదా ? అన్నంత అనుమానం కలిగింది! కళ్ళ జోడు తుడుచుకుని పెట్టుకుంటూ "ఎంత మారిపోయావురా?" అన్నాడు.

"రమా ! ఇంకో పాట్ కాఫీ పంపు, ఏంరా సంగతులు? ఈమధ్య ఎక్కడున్నావ్ ? ఇంతకూ ఎప్పుడొచ్చా వేమిటి ?"

విశ్వం నిన్న సాయంకాలంనుంచీ అతని అడ్రసు తెలుసుకోటానికి ఎంత అవస్థపడిందీ, హనుమంతరావు గుమాస్తా నౌకరీచేసిన ఆఫీసుకు, అప్పట్లో అతనుంటూన్న గదికిపోయి, వాకబు చేసిన సంగతీ చెప్పాడు.

"ఒరేబాబూ! ఇంతకీ స్టార్ సిగరెట్ తాగే గుమాస్తా; త్రీకాజిల్స తాగుతూన్న మిలియనేర్ ఎలా అయాడో చెప్పావు కాదేరా ?"

"అదంతా నీవురాసే కథల్లాంటి వో తమాషా కథేరా?"

"ఊఁ చెప్పరా బాబూ! వూరికే ఏడిపించక."

"సంవత్సరం క్రితం ఐర్లెండు రేస్ లాటరీలో లక్షా యిరవై వేలు వచ్చినట్లు టెలిగ్రాం వచ్చింది. దాంతో మన స్టార్ తిరిగిందంటే నమ్మ్."

"నిజంగానే లక్షయిరవై వేలు వచ్చాయా?" కలవర పడుతూ అడిగాడు విశ్వం.

సంవత్సరన్నర క్రితం జరిగిన సంఘటన గుర్తుకొచ్చి స్నేహితులిద్దరూ నొచ్చుకున్నాడు. హనుమంతరావు రేసు లాటరీకి పదిహేను రూపాయలుకట్టి కాఫీకూడా లేకుండా అవస్థ పడ్తూంటే, విశ్వం అతన్ని ఎంతగానో హేళన చేసి ఏడ్పించాడు.

ఐదునిముషాలు నిశ్చలంగా ఉండిపోయాడు. హనుమంతరావు, సిగరెట్ గట్టిగాపీల్చి పొగవదుల్తూ ముందుకు వంగి గంభీరంగా విశ్వం కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు.

"అందరూ అనుకున్నట్లే నేనూ అనుకున్నాను. మొదట్లో లక్షా యిరవై వేలు వచ్చాయని; కాని చెక్కు పంపమని ఎన్నోసార్లు రాయగా చివరకు "మీకు ప్రయిజంటూ ఏమీ రాలేదని, మీ కొచ్చిన టెలిగ్రాంకూ మాకూ ఏమీ సంబంధంలేదనీ" రాశారు."

"మరి ఆ విషయం అందరికీ తెలియలా?" ఎగశ్వాస దిగశ్వాసతో విశ్వం ఉబ్బసం రోగిలా అన్నాడు.

"ఊహుఁ ఎవ్వరికీ తెలియ నీయలేదు. బ్యాంక్‌లో వేశానని చెప్పాను."

"ఉట్టినే వేశానన్నంత మాత్రానే ఎలా నమ్మారు?" అయోమయంగానే అన్నాడు విశ్వం.

హనుమంతరావు లేచి విశ్వం భుజంతట్టుతూ,

"ఒరే విశ్వం! అనుభవంలో నేర్చుకున్న రహస్య సత్యంరా యిది! ఒకసారి ప్రపంచం నీకు డబ్బున్నదని నమ్మాక, మళ్ళీ దాన్ని అనుమానించటం అంటూ వుండదు. ఏం చేశావ్? ఎక్కడ పెట్టావ్? అని నిన్ను అడగదు. అవసరమైన హోదాను, డాంబికాన్ని నీవు నటించ గలిగినంత కాలం, సమాజం నిన్నొకసారి ధనికుడుగా గుర్తిస్తే, దాన్ని చలామణి చేసుకొనే అవకాశాలను అదే యిస్తుంది. నీవు చేయాల్సిందల్లా వాటిని జాగ్రత్తగా ఉపయోగించుకోటమే!"

"ఎప్పటికైనా బయట పడకపోతుందా."

"ఉష్! ఇప్పుడు వొక లక్షేమిటి? మూడు లక్షల రూపాయలదాకా బ్యాంక్‌లో వుంది నా పేరుమీద. మిల్లు తాలూకు జమాకర్చులన్నీ నేనేగా చూడ్డం మరి! నిలవ డబ్బంతా నా అకౌంటులోనే వేస్తూవుంటాను."

అయిపోతున్న సిగరెట్‌కు మరో సిగరెట్‌ను అంటిం చుతూ "ఇంతకీ నాకా టెలిగ్రాం ఎలా వచ్చిందో యింత వరకూ అంతుబట్ట లేదురా?" చిరునవ్వును ఆపుకుంటూ అన్నాడు హనుమంతరావు.

రచయిత విశ్వం మొహం వెల వెల పోయింది. మూడంతస్తులమేడా అమాంతం విరిగి అతని నెత్తిమీద పడ్డట్టయింది! కేస్ ప్రయిజులు తెలియగానే హనుమంత రావును ఉడికించి యేడిపించాలనే ఉద్దేశ్యంతో, కలకత్తాలో ఉంటూన్న తనే అప్పుడు సర్దాగా టెలిగ్రాం యిచ్చానని చెప్పాడు.

# హెడ్ కానిస్టేబుల్

వేమయ్యకు అంత తొందర్లోనే హెడ్ కానిస్టేబులుగా ప్రమోషన్ రావటం చాలామందికి ఆశ్చర్యాన్ని కలిగించింది. అయితే, వేమయ్య సంగతి బాగా తెలిసిన వాళ్ళందరూ, యీ ప్రమోషన్ యింతకు ముందెప్పుడో రావల్సిందన్నారు.

వేమయ్య పోలీసు వుద్యోగంలో చేరిన మూడు నెల్లకే అరవై కేసులు పైగా పట్టుకొన్నాడంటే అతని శక్తి సామర్థ్యాల్ను గురించి వేరే చెప్పాల్సిందేమీ లేదు. కానిస్టేబులు 'త్రీనాట్ ఫోర్' అంటే ఎవరో పోలీసు డిపార్టుమెంట్ లో క్రిందనుంచి పైదాకా తెలిసి పోయింది. కానిస్టేబుల్ వేమయ్య డ్యూటీలో వున్నాడంటే రిక్షావాళ్ళ గుండెల్లో రైళ్ళే పరుగెడతాయో, విమానాలే దూసుకుపోతాయో వాళ్ళకే తెలియాలి! అలా అని వేమయ్య అధికార దుర్వినియోగం చేసి, అక్రమాలకు, అన్యాయాలకు వొడిగట్టుతున్నాడనే నిర్ణయానికి రావడం వట్టి పొరపాటు. వేమయ్య ముక్కుకు సూటిగా నడుస్తాడు; కనపడినంతవరకే చూస్తాడు; వినపడ్డంతవరకే వింటాడు.

వేమయ్య డ్యూటీ చేస్తాడు. రూల్సు మాట్లాడుతాడు. అంతే; యూనిఫారంలో వున్నా, మఫ్టీలో వున్నా వేమయ్య వేమయ్యే! వేమయ్య శరీరం రోజుకు ఎనిమది గంటలు